# ప్రభాత ఉదయం

తెలుగు దినపత్రిక

సంపుటి: 2 | సంచిక: 33 | పేజీలు: 4 | వెల: రూ.3/- | సోమవారం 13 మే 2024 | ఎడిటర్: కోట్ల చంద్రకాంత్




## ఓటుహక్కు వినియోగించుకోనున్న సెలబ్రిటీలు

హైదరాబాద్, మే 12 (ప్రభాత ఉదయం): ఎన్నికల పండుగ రోజు సామాన్యులతో పాటు సెలబ్రిటీలంతా ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. గతంలో కూడా వీరు క్యూలో నిలబడి మీర ఓటేశారు. ఎవరెక్కడ వినియోగించుకోనున్నా రంటే.. ఓబుల్‌రెడ్డి స్కూల్‌లో జూనియర్ ఎన్టీఆర్, ప్రణతి ఓటు హక్కును వినియోగించుకున్నారు. బీఎస్ఎన్ఎల్ సెంటర్ జూబ్లీహిల్స్‌లో అల్లు అర్జున్, స్నేహారెడ్డి, అల్లు అరవింద్, అల్లు శిరీష్ .. జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌లో మహేశ్‌బాబు, నమ్రత , మంచు మోహన్‌బాబు, విష్ణు, లక్ష్మి, మనోజ్, విజయ దేవరకొండ, ఆనంద్ దేవరకొండ, శ్రీకాంత్, జీవిత, రాజశేఖర్ ఓటు హక్కును వినియోగించుకున్నారు.ఎఫ్ఎన్‌సీసీలో ..మిగతా 2లో


# లోక్‌సభ సమరం



## 17 స్థానాలకు హోరాహోరీ పోటీ

- మూడు పార్టీలకు ప్రతిష్టాత్మకంగా సీట్లు
- డబుల్ డిజిట్‌పై కన్నేసిన కాంగ్రెస్, బిజెపి
- ఉదయం 7 గంటలకే పోలింగ్ ప్రారంభం
- పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్లిన సిబ్బంది
- భారీ బందోబస్తు ఏర్పాటు చేసిన ఇసి

హైదరాబాద్, మే 12 (ప్రభాత ఉదయం): తెలంగాణలో పార్లమెంట్ ఎన్నికలు మూడు పార్టీలకు ప్రతిష్టాత్మకంగా మారాయి. సత్తా చాటాలని బిజెపి చూస్తోంది. 400 సీట్ల టార్గెట్‌లో కనీసం ఏడెనిమిది సీట్లు సాధించాలన్న పట్టుదలతో ప్రచారం నిర్వహించింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలంగాణపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించడం ఈ ఎన్నికల్లో విశేషం. అలాగే నడ్డా, అమిత్ షాతో పాటు ఇతర రాష్ట్రాల సిఎంలు కూడా ప్రచారంలో పాల్గొన్నారు. గత ఎన్నికల్లో తెలంగాణలో అనూహ్యంగా నాలుగు సీట్లు గెలుచుకున్న బీజేపీ ఇప్పుడు మెజారిటీ స్థానాలు కైవశం చేసుకోవడానికి ఉవ్విళ్లూరుతుండగా.. అధికార కాంగ్రెస్ పార్టీ ఆధిపత్యం నిలుపుకొనే ప్రయత్నం చేస్తోంది. ఈ పార్లమెంట్ ఎన్నికలు ప్రధానంగా సిఎం రేవంత్ రెడ్డికి ప్రతిష్ఠాత్మకం కానున్నాయి. గతంలో ఉన్న మూడు సీట్లను మించి సీట్లు సాధిస్తేనే ఆయన నాయకత్వంపై గురికుదురుతుంది. అలాగే మంత్రులకు ప్రతిష్టాత్మకంగా మారాయి. ఒక్కో పార్లమెంట్ నియాజకవర్గానికి మంత్రులు ఇన్‌ఛార్జులుగా ఉన్నారు. గతంలో ప్రాతినిధ్యం వహించిన రేంవత్ రెడ్డి, కోమటిరెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డిలకు మల్కాజిగిరి, ..మిగతా 2లో




## ఏపీలో సార్వత్రిక సమరం

- తీర్పు ఇవ్వబోతున్న ఓటరు
- జగన్, చంద్రబాబుల భవితవ్యంపై తీర్పు
- 175 అసెంబ్లీ, 25 పార్లమెంట్ స్థానాలకు పోటీ
- ఉదయం 7నుంచే పోలింగ్ ప్రారంభం
- సామాగ్రితో పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న సిబ్బంది
- భారీ బందోబస్తు మధ్య ప్రత్యేక బస్సుల్లో తరలింపు
- పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు

అమరావతి, మే 12 (ప్రభాత ఉదయం): సార్వత్రిక ఎన్నికల సమరంలో అసలు ఘట్టం నేడు ఆవిష్కృతం కానుంది. ఎన్నికల ప్రచారం ముగిసిన వేళ నేడు పోలింగ్ జరుగనుంది. తెలంగాణలో 17 పార్లమెంట్ స్థానాలకు పోటీ జరుగనుండగా ఎపిలో 25 స్థానాలకు పోటీ జరుగుతోంది. ఇక ఎపిలో 175 అసెంబ్లీ స్థానాలకు పోలింగ్ జరుగనుంది. సోమవారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రి 6 గంటల వరకు పోలింగ్ జరుగనుంది. ఈ మేరకు పోలింగ్ సిబ్బంది తమకు కేటాయించిన సామాగ్రితో ఆయా పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. ప్రత్యేక బస్సుల్లో భారీ భద్రత మధ్య వీరిని చేరవేశారు. వానలు పడతాయన్న సమచారంతో ఇసి ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. ఇక ప్రధానంగా ఎపిలో అధికారం ఎవరిదనేది ప్రజలు నిర్ణయించబో తున్నారు. అటు టిడిపి కూటమి, ఇటు వైసిపి హోరాహోరీగా ప్రచారం నిర్వహించాయి. మరోమారు అధికరాంలోకి రావడానికి జగన్ సర్వశక్తులు ఒడ్డారు. తానే స్టార్ కాంపెయినర్‌గా ప్రచారం నిర్వహించారు. ఒక్క చాన్స్‌తో గత అసెంబ్లీ ఎన్నికల్లో అధికారం దక్కించుకున్న జగన్, సంక్షేమ కార్యక్రమాల పేరుతో ప్రజల ఖాతాల్లో డబ్బులు వేస్తూ పోయారు. ఇదే తన పరిపాలనకు గీటురాయి అని, లబ్ది పొందిన వారు ఓటేయాలని ప్రచారంలో కోరారు. అధికారంలో ఉండగా విపక్ష నేతలపై కేసులతో ఉక్కిరిబిక్కిరి చేశారు. ఎదురుతిరిగిన వారిని కేసులతో వేధించారు. ఈ అంశాలే ఎన్నికల్లో ప్రచారాంశాలుగా మారాయి. జగన్‌కు దీటుగా చంద్రబాబు, పవన్ కళ్యాణ్, మోడీలు ప్రచారం చేపట్టారు. తిరిగి అధికారం కోసం చంద్రబాబు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఈ క్రమంలో ఎపిలో అదృష్టం ఎవరిని వరించనుందో గానీ..పోలింగ్ తీరును బట్టి అంచనావేయవచ్చు. ప్రచారంలో ఎవరు ఎవరికి తగ్గని విధంగా ..మిగతా 2లో

## అమెరికాలో మరో ఇద్దరు తెలుగు విద్యార్థులు మృతి

### ఆందోళన కలిగిస్తున్న మరణాలు



హైదరాబాద్, మే 12 (ప్రభాత ఉదయం): అమెరికాలో తెలుగు విద్యార్థుల మరణాలు ఆందోళన కలిగిస్తున్నాయి. తాజాగా, ఇద్దరు తెలుగు విద్యార్థులు జలపాతంలో ఈతకు వెళ్లి ప్రమాదవశాత్తు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన అమెరికాలోని అరిజోనాలో ఫజిల్ క్రీక్ ఫాల్స్ వద్ద జరిగింది. ఈ నెల 8వ తేదీన 16 మంది స్నేహితుల బృందం స్నాతకోత్సవం సందర్భంగా జలపాతం వద్దకు వెళ్లింది. ఈ క్రమంలో లక్కిరెడ్డి రాకేశ్ రెడ్డి, రోహిత్ మణికంఠ లేపాల అనే ఇద్దరు విద్యార్థులు జలపాతంలో ఈత కొడుతూ ప్రమాదవశాత్తు మునిగిపోయారు. గమనించిన స్నేహితులు వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వారి కోసం గాలింపు ప్రారంభించగా మొదటి రోజు వీరి ఆచూకీ లభించలేదు. రెండో రోజు వీరి మృతదేహాలను గుర్తించారు. మృతుల్లో తెలంగాణ విద్యార్థి లక్కిరెడ్డి రాకేశ్ రెడ్డి.. ఖమ్మం నగరంలోని విద్యా రంగ ప్రముఖులు లక్కిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి ఏకైక కుమారుడు. ఇతను కంప్యూటర్ సైన్స్ లో మాస్టర్స్ డిగ్రీ పూర్తి చేశాడు. ఇక మరో విద్యార్థి రోహిత్ మణికంఠ వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. కాగా, కుమారుడి స్నాతకోత్సవం వేడుకకు హాజరయ్యేందుకు ..మిగతా 2లో

## తెలంగాణలో పిడుగులతో వర్షాలు

### వాతావరణశాఖ హెచ్చరికలతో సీఎం సమీక్ష

**అప్రమత్తంగా ఉండాలని అధికారులకు ఆదేశాలు**

**ఆదిలాబాద్‌లో గాలివాన బీభత్సం**

**మెదక్ జిల్లాలో పిడుగుపాటుకు తండ్రీకొడుకుల మృతి**



హైదరాబాద్, మే 12 (ప్రభాత ఉదయం): తెలంగాణలో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదివారం సమీక్ష చేశారు. ఆదిలాబాద్, మెదక్, సంగారెడ్డితో పాటు పలు జిల్లాల పరిధిలో గాలి వాన, పిడుగులు పడి సంభవించిన నష్టంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరా తీశారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలని, తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. భారీ వర్షాలు పడుతాయని వాతావరణ శాఖ సూచనలు ఉన్నందున జిల్లాల్లో కలెక్టర్లు, రాష్ట్ర స్థాయిలో ఉన్నతాధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఎక్కడ ఎలాంటి ఆపద వచ్చినా సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది తగిన సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మెదక్ జిల్లాలో పెద్ద శంకరంపేట మండలంలో పిడుగు పడి ఇద్దరు మృతి చెందిన ఘటనపై సీఎం రేవంత్ విచారం వ్యక్తం ..మిగతా 2లో

## సీఎం రేవంత్ ఆటవిడుపు

హైదరాబాద్, మే 12 (ప్రభాత ఉదయం): ఎన్నికల ప్రచారం శనివారం సాయంత్రంతో ముగిసిపోయింది. కొద్ది నెలలుగా ప్రచారంలో రోజుకు పలు ప్రాంతాలు తిరుగుతూ క్షణం తీరిక లేకుండా గడిపిన రాజకీయ నాయకులు కాస్త ఊరట పొందుతున్నారు. వీరిలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైదరాబాద్ సెంట్రల్ యూవర్సిటీలో సరదాగా ఫుట్ బాల్ ఆడారు. ఆట మధ్యలో షూ పాడైపోతే షూ లేకుండనే సీఎం ఫుట్ బాల్ ఆడారు. సీఎం రేవంత్ రెడ్డితోపాటు ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, హెచ్‌సీయూ విద్యార్థులు తదితరులు సీఎంతో పాటు ఫుట్ బాల్ ఆడారు. ఈ ఫుట్ బాల్ మ్యాచ్ కి సీఎం సలహాదారుడు వేంనరేందర్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారుడు హర్కర్ వేణుగోపాల్, ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ ఏం ఏ ఫహీం, టీ శాట్ సీఈఓ వేణుగోపాల్ రెడ్డి ఇతరులు కూడా హాజరయ్యారు.



## ఆర్టీసీ సంక్రాంతి రికార్డు బ్రేక్



### మూడు రోజుల్లో 1.42 లక్షల మంది తరలింపు

### ఆర్టీసీ ఎండి సజ్జన్నార్ వెల్లడి

హైదరాబాద్, మే 12 (ప్రభాత ఉదయం): సార్వత్రిక ఎన్నికల వేళ సంక్రాంతి రికార్డును టీఎస్ఆర్టీసీ బ్రేక్ చేసింది. సంక్రాంతి సీజన్‌తో పోలిస్తే 10 శాతానికి పైగా ప్రయాణికులు ఆర్టీసీని వినియోగించుకున్నారు. ఈ నెల 9వ తేదీ నుంచి 11వ తేదీ వరకు 1.42 లక్షల మంది ప్రయాణించారని టీఎస్ఆర్టీసీ ఎండీ సజ్జనార్ వెల్లడించారు. ఇక ఏపీకి 59,800 మంది ప్రయాణించారని తెలిపారు. కాగా, సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ..మిగతా 2లో

# లోక్‌సభ సమరం

మొదటి పేజీ తరువాయి...

భువనగిరి, నల్లగొండల్లో గెలుపు ముఖ్యం. అలాగే పాలమూరులోని రెండు సీట్లు కూడా సిఎం రేవంత్‌కు ప్రతిష్టాత్మకం కానున్నాయి. ఐదు నెలల క్రితం అధికారం కోల్పోయిన కేసీఆర్ ఒకటి రెండు స్థానాలైనా గెలుచుకొని పార్టీని కాపాడుకొనే ప్రయత్నం చేస్తున్నారు. ఈ క్రమంలో నాయకులు ఒకరిపై ఒకరు దుమ్మెత్తి పోసుకున్నారు. లోక్‌సభ ఎన్నికలు తెలంగాణ భవిష్యత్ రాజకీయ ముఖచిత్రంపై ప్రభావం చూపనున్నందున మూడు ప్రధాన పార్టీలకూ ఎన్నికలు ప్రతిష్టాత్మకంగా మారాయి. సోమవారం జరగనున్న పోలింగ్‌లో తెలంగాణ ప్రజలు ఎవరిని ఆదరించబోతున్నారో, ఎవరిని తిరస్కరించబోతున్నారో తీర్పు ఇవ్వనున్నారు. శాసనసభ ఎన్నికల్లో ఓడిపోయి ఐదు నెలలైనా వాస్తవంలోకి రాకుండా తెలంగాణను పాలించే సమర్థత తనకు మాత్రమే ఉందన్న భ్రమల్లో ఉన్న కేసీఆర్ 12 సీట్లు గెలిస్తే తానే ప్రధాని అంటూ బీరాలు పలికారు. బహిరంగ సభల్లో కూడా అదే విధంగా మాట్లాడారు. కేవలం ఐదు నెలల వ్యవధిలో తెలంగాణ రాష్ట్రం సర్వనాశనం అయిందని ప్రచారం చేయడం ఆయన అధికారం కోల్పోవడం తట్టుకోలేక పోయారని నిరూపిస్తోంది. తెలంగాణలో ఈ ఎన్నికలు రాజకీయ పార్టీలకు కీలకం కానున్నాయి.
దేశవ్యాప్తంగా సార్వత్రిక ఎన్నికలు మొత్తం ఏడు దశల్లో జరుగుతున్నాయి. ఆ క్రమంలో ఇప్పటి వరకు మూడు దశలో.. మొత్తం 285 లోక్‌సభ స్థానాలకు పోలింగ్ జరిగింది. రేపు నాలుగో దశ పోలింగ్ జరుగుతుంది. ఇంకా మూడు దశలు మే 20, మే 25, జూన్ 1వ తేదీన జరగనున్నాయి. జూన్ 4వ తేదీన ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభం కానుంది. అదే రోజు.. దేశంలోని ఓటరు ఏ పార్టీకి అధికారం కట్టబెడతాడనే విషయం స్పష్టం కానుంది. అలాగే ఆంధ్రప్రదేశ్, ఒడిశా, సిక్కిం, అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు సైతం అదే రోజు లెక్కించనున్నారు. దీంతో ఆ యా రాష్ట్రాల్లోని ఓటర్లు ఏ పార్టీకి పట్టం
కట్టాడనేది సుస్పష్టం కానుంది. అలాగే ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలోని మొత్తం 175 స్థానాలకు ఎన్నికలు జరుగనున్నాయి. మరోవైపు ఒడిశా



అసెంబ్లీకి సైతం 4 దశల్లో ఎన్నికలు జరగనున్నాయి. ఆ క్రమంలో మే 13వ తేదీన ఆ రాష్ట్ర అసెంబ్లీకి తొలి దశ పోలింగ్ జరగనుంది. జూన్ 1వ తేదీన జరిగే నాలుగో దశ పోలింగ్‌తో.. ఒడిశా అసెంబ్లీకి పోలింగ్ ముగియనుంది.ఇక లోక్‌సభ ఎన్నికల్లో హైదరాబాద్ నుంచి మాధవిలత, అసదుద్దీన్ ఓవైసీ, కరీంనగర్ నుంచి బండి సంజయ్, బిహార్‌లోని బిగుసరాయి నుంచి గిరిరాజ్ సింగ్, కడప నుంచి వైయస్ షర్మిల, జార్ఖండ్‌లోని ఖుంతి నుంచి అర్జున్ ముండా, బెంగాల్‌లోని అసన్‌సోల్ నుంచి శతృఘ్నసిన్హా, బెహరంపూర్ నుంచి యూసఫ్ పఠాన్, అధిర్ రంజన్ చౌదరి, రాజంపేట నుంచి ఎన్ కిరణ్ కుమార్ రెడ్డి తదితరులు ఎన్నికల బరిలో నిలిచారు. తెలంగాణలో బండి సంజయ్, ధర్మపురి అర్వింద్ కిషన్ రెడ్డిలు మరోమారు పోటీ పడుతున్నారు. లోక్ సభ ఎన్నికలకు శనివారం సాయంత్రం 6 గంటలకు ప్రచారం ముగిసింది. ఆ తరవాత తెలంగాణ రాష్ట్రంలో 144 సెక్షన్ అమలవుతోందని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్ రాజ్ తెలిపారు. ఎన్నికల నిర్వహణకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. 160 కేంద్ర కంపెనీల బలగాలు రాష్ట్రంలో ఇప్పటికే మోహరించాయని వివరించారు. ఇతర రాష్ట్రాల నుంచి 20 వేల పోలీస్ బలగాలు వచ్చాయని పేర్కొన్నారు. ప్రతి పార్లమెంట్ సెగ్మెంట్‌లో రెండు బ్యాలెట్ యూనిట్లు ఉంటాయని వివరించారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ అసెంబ్లీ ఉప ఎన్నికలో 232 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని వికాస్ రాజ్ స్పష్టం చేశారు. ఈవీఎంలు తరలించే వాహనాలకు జీపీఎస్ ఉంటుందని, వాటిని సీఈఓ ఆఫీస్ ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేస్తుందని సీఈవో వికాస్ రాజ్ తెలిపారు. లక్ష 90 వేల మంది పోలింగ్ విధుల్లో పాల్గొంటున్నారని వివరించారు. వచ్చే 48 గంటల పాటు వచ్చే ఫిర్యాదులపై 100 నిమిషాల్లో చర్యలు తీసుకుంటామని వివరించారు. 21 వేల 680 మంది ఓటర్లు హోం ఓటింగ్ వేసుకున్నారని వికాస్ రాజ్ తెలిపారు. 328 పోలింగ్ కేంద్రాలను ఏజెన్సీ ఏరియాల్లో ఏర్పాటు చేశామని వెల్లడించారు. మూడు పోలింగ్ కేంద్రంలో అత్యల్ప ఓటర్లు ఉన్నారని తెలిపారు. ఎన్నికల సంఘం దాదాపు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఎన్నికల విధుల్లో 2.80 లక్షల మంది ఉద్యోగులు పాల్గొననున్నారు. రాష్ట్రంలో మొత్తం 3.32 కోట్ల మంది ఓటర్లు ఉండగా. ఇందులో సగానికి పైగా మహిళా ఓటర్లే ఉన్నారు. 17 పార్లమెంట్ నియోజకవర్గాలకుగాను 13 నియోజక వర్గాల్లో మహిళ ఓటర్లే ఎక్కువగా ఉన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 35 వేల 809 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రతి పోలింగ్ స్టేషన్లలో ఎండలను దృష్టిలో పెట్టుకుని ఏర్పాట్లు చేయాలని సూచించింది ఎన్నికల సంఘం. 9,900 పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మకమైనవిగా గుర్తించిన ఎన్నికల సంఘం, అలాంటి ఏరియాల్లో ప్రత్యేక బలగాలతో నిఘా పెట్టేలా ప్లాన్ చేసింది. ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 6 వరకు పోలింగ్ జరుగనుంది. రాష్ట్రంలో 13 అసెంబ్లీ నియోజకవర్గాలను నక్సల్స్ ప్రభావిత ప్రాంతాలుగా గుర్తించిన ఎన్నికల సంఘం.. అలాంటి ప్రాంతాల్లో సాయంత్రం 4 గంటల వరకే పోలింగ్ జరగాలని నిర్ణయించింది. రాష్ట్ర పోలీసులతో పాటు ఎన్నికల విధుల్లో భాగంగా కేంద్రం నుండి 175 కంపెనీలు విధుల్లో ఉండనున్నాయి. ఎన్నికల విధుల్లో 2.80 లక్షల మంది ఉద్యోగులు విధులు నిర్వర్తించనున్నారు. ఎన్నికల్లో వ్యయ పరిశీలకులుగా 14 మందిని నియమించారు. జనరల్ పరిశీలకులుగా 17 మందిని నియమించారు. ఇకపోతే ఎన్నికల సిబ్బంది సామాగ్రితో తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. వారిని ప్రత్యేక వాహనాల్లో భద్రత మధ్య చేరవేశారు.



## ఏపీలో సార్వత్రిక సమరం

మొదటి పేజీ తరువాయి...

ప్రచారం చేసుకున్నారు. అలాగే ఈ ఎన్నికల్లో పులువురు ప్రముఖులు తమ అదృష్టాన్ని పరీక్షించుకోబుతున్నారు. తెలుగునాట అధికార, ప్రతిపక్ష నాయకులు, జాతీయ స్థాయి నాయకులు కూడా తమ వాగ్దానాలతో ప్రజలను ఊదరగొట్టారు. ఇకపోతే పలు నియోజకవర్గాల్లో జనగ్ అబ్యర్థులను మార్చారు. చాలామంది వైకాపాను వీడారు. కొందరు టిడిపి నుంచి పోటీ చేస్తున్నారు. ఈ క్రమంలో కుప్పం నుంచి చంద్రబాబు, మంగళగిరి నుంచి లోకేశ్, పిఠాపురం నుంచి పవన్ కళ్యాణ్, పులివెందుల నుంచి జగన్ పోటీలో ఉన్నారు. పగ, ప్రతీకారాలతో సాగిన జగన్‌రెడ్డి ఐదేళ్ల పాలనతో ఉక్కిరిబిక్కిరైన ప్రధాన ప్రతిపక్షాలు తెలుగుదేశం, జనసేన ఒక్కటయ్యాయి. చివరకు భారతీయ జనతా పార్టీ కూడా ఈ రెండు పార్టీలతో జట్టు కట్టింది. దీంతో రాష్ట్రంలో ఎన్డీయే కూటమి ఎన్నికల బరిలోకి దిగింది. నరేంద్ర మోదీ, చంద్రబాబు మళ్లీ చేతులు కలపాల్సిన పరిస్థితి వచ్చింది. చంద్రబాబుపై అనేక కేసులు పెట్టిన జగన్ ప్రభుత్వం చివరకు స్కిల్ కేసు పేరిట 52 రోజుల పాటు జైల్లో నిర్బంధించింది. ఈ ఘటనతో తెలుగుదేశం, జనసేన మైత్రీ బంధం పటిష్ఠమైంది. జైలు నుంచి విడుదలైన చంద్రబాబు, ఈ ఎన్నికల్లో జగన్‌రెడ్డిని ఓడించకపోతే తన రాజకీయ జీవితం ముగుస్తుందని గుర్తించి భారతీయ జనతా పార్టీతో కూడా జతకట్టారు. దీంతో రాష్ట్రంలో ప్రధాన పోరు ఎన్డీయే కూటమికీ, వైసీపీకి మధ్య జరుగుతోంది. ప్రజలు కూడా జగన్ అనుకూల, వ్యతిరేక వర్గాలుగా చీలిపోయారు. ఐదేళ్ల జగన్ పాలనలో మరో కీలక పరిణామం కూడా చోటుచేసుకుంది. 2019 ఎన్నికల వరకు జగన్‌కు అండగా ఉంటూ ఆయన కోసం పాదయాత్ర చేయడమే కాకుండా ఎన్నికల ప్రచారం నిర్వహించిన చెల్లెలు షర్మిల.. జగన్ కుటుంబానికి దూరమయ్యారు. వైఎస్ రాజశేఖర రెడ్డి కుటుంబం రెండుగా చీలిపోయింది. వైసీపీ గౌరవ అధ్యక్షురాలి పదవి నుంచి తల్లి విజయమ్మను తప్పించిన జగన్‌రెడ్డి ఆమెకు పార్టీతో సంబంధం లేకుండా చేశారు. ఇద్దరు బిడ్డలూ చెరోదారి అయిన నేపథ్యంలో ఎటూ చెప్పలేక ఆమె అమెరికాకు వెళ్లిపోయారు. కాకపోతే ఎన్నికల ప్రచారం చివరి రోజున ఓ వీడియో సందేశం విడుదల చేశారు. కడప బరిలో అవినాశ్‌రెడ్డిపై పోటీ పడుతున్న షర్మిలకు మద్దతు ప్రకటించారు. కడప ఎంపీ స్థానానికి పోటీ చేస్తున్న షర్మిలకు మద్దతుగా సునీత నిలిచారు. కడప నుంచి వైసీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న అవినాశ్ రెడ్డి కోసం జగన్మోహన్ రెడ్డి తన సొంత చెల్లెలు షర్మిలను కూడా దూరం చేసుకున్నారు. నవరత్నాలు పేరిట ప్రజలకు డబ్బు పంచడమే ముఖ్యమంత్రి చేయాల్సిన గొప్ప పని అని జగన్ భావించారు. అందుకే ప్రతి కుటుంబానికి డబ్బు పంచిన తనకే మళ్లీ అధికారం అప్పగించాలని ఆయన కోరుతున్నారు. తనకు ఓటు వేయకపోతే అమలులో ఉన్న పథకాలను ఎత్తేస్తారని ఆయన ప్రచారం చేసారు. జగన్ పాలనలో అభివృద్ధి కుంటుపడి రాష్ట్రం అప్పులపాలు అయ్యిందన్నది నిజం. బటన్ నొక్కితే చాలు అన్నట్టుగా జగన్ పాలన సాగింది. వలంటీర్ వ్యవస్థను రాజకీయ ప్రయోజనాలకు వాడుకోవడం వల్ల దాని ఏర్పాటు లక్ష్యం కూడా దెబ్బతింది. జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చాక రాజధాని అమరావతి నిర్మాణం ఆగిపోయింది. పోలవరం ప్రాజెక్టు మూలనపడింది. ఈ క్రమంలో ప్రజలు ఎవరిని ఆదరిస్తారన్నది చూడాలి. 13 ఎన్నిక జరునుండగా, జూన్ 4న పలితాలు వెలువడనున్నాయి. గతంలో ఎప్పుడూ లేనంతగా ఓటర్లు వివిధ ప్రాంతాల నుంచి ఎపికి చేరుకున్నారు. ఓటింగ్ శాతం పెరిగేందుకు చర్యలు తీసుకున్నారు. ఏపీలో సార్వత్రిక ఎన్నికలతో పాటు పార్లమెంట్‌కు మే 13న పోలింగ్ జరుగుతున్న క్రమంలో రాష్ట్రం అంతటా 144 సెక్షన్ అమల్లోకి వచ్చింది. 13 తేదీన ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకూ పోలింగ్ జరుగుతుందని సిఇవో మీనా తెలిపారు. 13న 6 పోలింగ్ కేంద్రాల్లో 3 చోట్ల 4 గంటలకు, మూడు చోట్ల 5 గంటలకే పోలింగ్ ముగుస్తుందని తెలిపారు. పోలింగ్‌కు 90 నిమిషాల ముందు మాక్ పోల్ నిర్వహిస్తామని వివరించారు. 13 తేదీన సరిగ్గా 7 గంటలకు పోలింగ్ మొదలు అవుతుందని ప్రకటించారు. పోలింగ్ ఏజెంట్‌కు సంబంధించి కొన్ని మార్గదర్శకాలు ఇచ్చామన్నారు.నియోజకవర్గంలో స్థానికుడైన అభ్యర్థి నుంచి ధ్రువపత్రాల తీసుకుంటే ప్రిసైడింగ్ అధికారి ఏజెంట్ గా అనుమతి ఇవ్వొచ్చని వివరించారు. అలాగే పోలింగ్ కేంద్రానికి 200 మీటర్ల పరిధిలో రాజకీయ పార్టీలు ఎలాంటి చిహ్నాలు లేకుండా స్లిప్‌లు పంచుకోవచ్చని అన్నారు. అలాగే పోలింగ్ రోజు ప్రజల రవాణాను నిరోధించాలని ఎన్నికల సంఘం ఉద్దేశ్యం కాదన్నారు. ఓటర్లను రాజకీయ పార్టీలు తరలించడం చట్ట వ్యతిరేకమని అన్నారు. అభ్యర్థికి సంబంధించి వాహనాల పరిమితి ఉందన్నారు. మూడు వాహనాల వరకే సదరు అభ్యర్థి వినియోగించు కోవచ్చని చెప్పారు. పోలింగ్ కేంద్రాల్లోకి ప్రిసైడింగ్ అధికారి మినహా ఎవరూ ఫోన్లు తీసుకెవెళ్లేందుకు అనుమతి లేదన్నారు. ఓటర్లు కూడా ఫోన్లు తెచ్చేందుకు అనుమతి లేదన్నారు.అలాగే ఆయుధాలతో ఎవరూ పోలింగ్ కేంద్రాల్లోకి అనుమతించామని స్పష్టం చేశారు. మంత్రులు, ప్రజా ప్రతినిధులు ఎవరూ గన్ మెన్లతో పోలింగ్ కేంద్రాల్లోకి రావొద్దని విజ్ఞప్తి చేశారు. పోలింగ్ కేంద్రాల్లో భద్రత కోసం 1,06,145 మంది పోలీసు బలగాలను వినియోగిస్తున్నామని సీఈఓ మీనా తెలిపారు.

### నేటి పోలింగ్‌పై నేతల నజర్

రాష్ట్రంలో ఎన్నికల ప్రచారానికి తెరపడడంతో ఇక పోల్ మేనేజ్‌మెంట్‌పై నేతలు దృష్టి సారించారు. గురువారం జరిగే పోలింగ్‌లో ఎక్కువమందిని పోలింగ్ కేంద్రాలకు తీసుకుని వచ్చేలా బూత్ స్థాయి నేతలు ప్రయత్నాలు మొదలు పెట్టారు. నేతలు నేరుగా ఆయా నియోజకవర్గాల్లో పరిస్థితులను సమీక్షిస్తున్నారు. పోలింగ్‌కు కొన్ని గంటలు మాత్రమే మిగిలి ఉండడంతో ఓటర్లను నేరుగా కలుసుకుని ఓట్లను అర్థించే పనిలో పడ్డారు. అన్ని నియోజకవర్గాల్లో సోమవారం పోలింగ్ జరగ నుండడంతో రాష్ట్రమంతటా ఆంక్షలు అమలులోకి వచ్చాయి.



## సీఎం నితీష్ కుమార్‌తో కలిసి ప్రధాని మోడీ మెగా రోడ్ షో

హైదరాబాద్, మే 12 (ప్రభాత ఉదయం): ప్రధాని నరేంద్రమోదీ బీహార్ రాజధాని పాట్నాలో మెగా రోడ్ షో నిర్వహించారు. బీహార్ సీఎం నితీష్ కుమార్‌తో కలిసి ఆదివారం ప్రధాని రోడ్ షోలో పాల్గొన్నారు. వేలాది మంది మద్దతుదారులు, బీజేపీ, జేడీయూ కార్యకర్తలు ఈ రోడ్ షోలో పాల్గొన్నారు. వీరితో పాటు బీజేపీ నేతన రవి శంకర్ ప్రసాద్ కూడా ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ప్రత్యేక వాహనంపై ప్రధాని ప్రజలకు అభివాదం చేశారు. ప్రధానిని చూసేందుకు రోడ్డుకు ఇరువైపులా జనం బారులు తీరారు. 40 లోక్‌సభ స్థానాలు ఉన్న బీహార్ ఎన్డీయే కూటమికి కీలకంగా మారింది. గతంలో 2019 ఎన్నికల్లో బీజేపీ-జేడీయూ కూటమి ఏకంగా 39 స్థానాలను గెలుచుకుంది. ఈ సారి కూడా క్లీన్‌స్వీప్ చేయాలని భావిస్తోంది. ఏప్రిల్ 19న మొదటిదశలో ఔరంగాబాద్, గయా, జముయి మరియు నవాడ అనే నాలుగు నియోజకవర్గాలలో 49.26 శాతం ఓటింగ్ నమోదైంది. రెండవ దశలో, ఏప్రిల్ 26న 59.45 శాతం ఓటింగ్‌తో బంకా, భాగల్‌పూర్, కతిహార్, కిషన్‌గంజ్ మరియు పూర్నియా అనే ఐదు నియోజకవర్గాల్లో పోలింగ్ జరిగింది. మే 7న జరిగిన మూడో దశ ఝంజర్‌పూర్, సుపాల్, అరారియా, మాధేపురా మరియు ఖగారియా ఎంపీ స్థానాలకు ఎన్నికలు జరగగా, 58.18 శాతం ఓటింగ్ నమోదైంది. మే 13న జరిగే నాలుగో విడతలో రాష్ట్రంలోని 5 ఎంపీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. మరోవైపు ఈసారి ఇండియా కూటమిలో భాగంగా ఆర్జేడీ-కాంగ్రెస్-కమ్యూనిస్ట్ పార్టీలు పొత్తుతో పోటీ చేస్తున్నాయి. మొత్తం 40 ఎంపీ స్థానాల్లో 26 చోట్ల ఆర్జేడీ పోటీ చేస్తుండగా, మిగతా చోట్ల కాంగ్రెస్, లెఫ్ట్ పోటీ చేస్తున్నాయి. మరోవైపు బీజేపీ 17 స్థానాల్లో, జేడీయూ 16 స్థానాల్లో పోటీ చేస్తున్నాయి.

## అమెరికాలో మరో ఇద్దరు తెలుగు విద్యార్థులు మృతి

మొదటి పేజీ తరువాయి...

ఇటీవలే రాకేశ్ తల్లిదండ్రులు అమెరికా వెళ్లారు. అయితే, అనుకోని ప్రమాదంలో అతను మృతి చెందడంతో ఆ కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయింది. గడిచిన తొమ్మిదేళ్లలో ఈ జలపాతం వద్ద 9 మంది చనిపోయినట్లు తెలుస్తోంది. ఇక, ఏప్రిల్ లో ట్రెక్కింగ్ చేస్తూ ప్రమాదవశాత్తు జారి పడి ఇద్దరు తెలుగు విద్యార్థులు మృతి చెందారు. ఈ ఘటన స్కాట్లాండ్ లో జరిగింది. వీరిలో ఒకరు హైదరాబాద్ విద్యార్థి కాగా.. మరో విద్యార్థి ఏపీకి చెందిన విద్యార్థిగా గుర్తించారు. స్కాట్లాండ్ లోని యూనివర్శిటీలో మాస్టర్స్ చదువుతున్న ఇద్దరు విద్యార్థులు.. పెర్త్గ÷ర్ లోని లిన్ ఆఫ్ తమ్మెల్ కు వెళ్లారు. అక్కడ ట్రెక్కింగ్ చేస్తూ ప్రమాదవశాత్తు నీటిలో జారి పడి కొట్టుకుపోయారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే గాలింపు చేపట్టి ఇద్దరి మృతదేహాలను గుర్తించారు. మృతులు జితేంద్రనాథ్ (26), చాణక్య (22)గా గుర్తించారు. అగ్రరాజ్యంలో ప్రమాదవశాత్తు విద్యార్థుల మరణాలు ఓ వైపు ఆందోళన కలిగిస్తుంటే.. కొందరు తెలుగు విద్యార్థుల అదృశ్యం కూడా ఆందోళన కలిగిస్తోంది. తాజాగా, అమెరికాలో ఉన్నత విద్య కోసం వెళ్లిన తెలంగాణ విద్యార్థి అదృశ్యం కావడంతో అతని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. గత వారం రోజులుగా అతని ఆచూకీ లేదని అక్కడి భారత రాయబార కార్యాలయం పేర్కొంది. హన్మకొండకు చెందిన రూపేశ్ చంద్ర చింతకింది చికాగోలో విస్కాన్సిన్ లోని కాంకార్డియా యూనివర్శిటీలో మాస్టర్స్ చదువుతున్నాడు. చివరిసారిగా ఈ నెల 2న మధ్యాహ్నం రూపేశ్ తో తండ్రి వాట్సాప్ కాల్ లో మాట్లాడారు. ఆ తర్వాత అతని ఫోన్ స్విచ్చాఫ్ లోకి వెళ్లిపోయిందని తండ్రి తెలిపారు. అతని స్నేహితులతో మాట్లాడగా.. ఎవరినో కలవడానికి వెళ్లారని వారు ఎవరో తెలియదని రూపేశ్ స్నేహితులు సమాధానం ఇచ్చారు. దీంతో ఆందోళన చెందిన తల్లిదండ్రులు తమ కుమారుడి ఆచూకీ కనుగొనాలని భారత విదేశాంగ మంత్రిత్వ శాఖను, అమెరికా ఎంబసీని కోరారు.

## రోడ్డు ప్రమాదంలో టీవీ సీరియల్ నటి మృతి

### ‘త్రినయని’లో తిలోత్తమ పాత్రతో ఫేమస్

భూత్పూర్, మే 12 (ప్రభాత ఉదయం): రోడ్డు ప్రమాదంలో టీవీ సీరియల్ నటి పవిత్రాజయరాం మృతి చెందారు. ఈ ఘటన మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండలం శేరిపల్లి (బీ) వద్ద 44వ జాతీయ రహదారిపై చోటుచేసుకున్నది. పవిత్రా జయరాం (42) కర్ణాటకలోని బెంగళూరు నుంచి చెల్లెలు కూతురు ఆపేక్ష, సహనటుడు చంద్రకాంత్, డ్రైవర్ శ్రీకాంత్‌తో కలిసి శనివారం కారులో హైదరాబాద్‌కు బయలుదేరింది. అర్ధరాత్రి శేరిపల్లి(బీ) వద్ద డివైడర్‌ను ఢీకొని.. హైదరాబాద్ నుంచి కర్నూల్‌కు వెళ్తున్న వనపర్తి డిపో ఆర్టీసీ బస్సును గుద్దుకున్నది. ఈ ప్రమాదంలో పవిత్రతోపాటు కారులో ఉన్నవారందరూ గాయపడ్డారు. 108లో మహబూబ్‌నగర్ జిల్లా దవాఖానకు తరలించగా..పవిత్ర అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. పవిత్ర జీ తెలుగులో ప్రసారమవుతున్న ‘త్రినయని’, ‘నిన్నేపెళ్లాడుతా’ సీరియల్స్‌లో నటించింది. మృతురాలికి భర్త శివకుమార్‌గౌడ, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కేసు దర్యాప్తు చేపట్టినట్టు ఎస్సై శ్రీనివాసులు తెలిపారు.





## తెలంగాణలో పిడుగులతో వర్షాలు

మొదటి పేజీ తరువాయి...

చేశారు. చనిపోయిన ఇద్దరి కుటుంబాలను ఆదుకుంటామని అన్నారు. ఆదిలాబాద్ జిల్లాలోని జైనథ్ మండలంలోని గిమ్మగ్రామంలో పిడుగుపాటుకు ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయని, వారికి తగిన వైద్య సాయం అందేలా చూడాలని అక్కడి అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. ఎక్కడైనా కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసిపోతే, రైతులు ఆందోళన చెందవద్దని అండగా ఉంటామని సీఎం రేవంత్ హామీ ఇచ్చారు. కొనుగోలు కేంద్రాల్లోని తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఇదిలావుంటే ఆదిలాబాద్ జిల్లాలో గాలివాన భీబత్సం సృష్టించింది. ఆదివారం ఉరుములు, మెరుపులతో కురిసిన భారీ వర్షానికి పలు ప్రాంతాల్లో ధాన్యం తడిసిపోయింది. జైనథ్ మండలం పిడుగుపాటుకు ఐదుగురికి గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు గాయపడిన వారిని హాస్పిటల్‌కు తరలించారు. కాగా, మెదక్ జిల్లా పెద్ద శంకరంపేట మండలం రామోజీ పల్లిలో పిడుగుపాటుకు తండ్రి,కొడుకు శ్రీరాములు(45), శివరాజు(15)మృతి చెందాడు. కాగా, రాష్ట్రంలో రాగల నాలుగు రోజులు తెలంగాణవ్యాప్తంగా పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. పలుచోట్ల ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది. పార్లమెంట్ నాలుగో విడుత ఎన్నికలు తెలంగాణ వ్యాప్తంగా జరుగనున్నాయి. కంటోన్మెంట్ అసెంబ్లీ స్థానానికి సైతం ఉప ఎన్నికలు జరుగనున్నాయి. ఈ ఎన్నికలకు ఎలక్షన్ కమిషన్ ఏర్పాట్లు చేసింది. ఈ క్రమంలో వాతావరణ శాఖ కీలక ప్రకటన చేసింది. రాష్ట్రంలో రాగల నాలుగు రోజులు తెలంగాణవ్యాప్తంగా పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. పలుచోట్ల ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది. సోమవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో గంటకు 30-40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తూ వానలు కురిసే అవకాశాలున్నాయని చెప్పింది. మంగళవారం ఉమ్మడి ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, వనపర్తి, నారాయణపే, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వానలు పడుతాయని చెప్పింది. బుధ, గురువారాల్లోనూ పలు జిల్లాల్లో వానలు పడే అవకాశాలున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వివరించింది.

## ఓటుహక్కు వినియోగించుకోనున్న సెలబ్రిటీలు

మొదటి పేజీ తరువాయి...

రాఘవేంద్రరావు, విశ్వక్‌సేన్ , దగ్గుబాటి రాణా, సురేశ్ బాబు.. జూబ్లీహిల్స్ క్లబ్‌లో చిరంజీవి, సురేఖ, రాంచరణ్, ఉపాసన , నితిన్.. జూబ్లీ హిల్స్ న్యూ ఎంపీ, ఎమ్మెల్యే కాలనీ లో రవితేజ.. వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్‌లో నాగార్జున, అమల, నాగచైతన్య, అఖిల్.. మణికొండ హైస్కూల్ లో వెంకటేశ్, బ్రహ్మానందం.. షేక్ పేట్ ఇంటర్నేషనల్ స్కూల్ రాజమౌళి, రామారాజమౌళి.. బంజారాహిల్స్ ఎమ్మెల్యే కాలనీలో హీరో రామ్ పోతినేని.. గచ్చిబౌలి జిల్లా పరిషత్ పాఠశాలలో హీరో నాని.. దర్గా గవర్నమెంట్ ప్రైమరీ స్కూల్‌లో హీరో సుధీర్ బాబు.. రోడ్ నెం.45, జూబ్లీహిల్స్ ?ఆర్థిక సహకార సంస్థలో అల్లరి నరేశ్.. యూసఫ్‌గూడ చెక్‌పోస్టు ప్రభుత్వ పాఠశాలలో తనికెళ్ల భరణి ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇప్పుడు కూడా వీరంతా మరోమారు పార్లమెంట్ ఎన్నికల్లో తమ ఓటును వినయోగించుకోబోతున్నారు.



## ఢిల్లీ ఎయిర్‌పోర్టుకు బాంబ్ బెదిరింపు

### పోలీసుల తనిఖీలు

న్యూఢిల్లీ, మే 12 (ప్రభాత ఉదయం): దేశ రాజధాని ఢిల్లీలో బాంబు బెదిరింపులు తీవ్ర కలకలం రేపుతున్నాయి. మధ్యాహ్నం రెండు ఆస్పత్రులకు ఈమెయిల్ ద్వారా బెదిరింపులు రాగా.. తక్షణమే రంగంలోకి దిగిన పోలీసులు తనిఖీలు చేపట్టారు. తాజాగా ఢిల్లీ ఎయిర్‌పోర్టుకు కూడా బెదిరింపు వచ్చింది. దీంతో ఫైర్ సిబ్బంది, బాంబ్ స్క్వాడ్స్ రంగంలోకి దిగి తనిఖీలు చేపట్టారు. సార్వత్రిక ఎన్నికల వేళ బెదిరింపు కాల్స్ రావడంతో సీరియస్‌గా తీసుకుని సెర్చ్ చేశారు. మధ్యాహ్న సమయంలో బురారీ ఆస్పత్రికి, సంజయ్ గాంధీ ఆస్పత్రికి బెదిరింపు మెయిల్స్ వచ్చాయి. రంగంలోకి దిగిన పోలీసులు, ఫైర్ సిబ్బంది తనిఖీలు చేపట్టారు. బాంబ్ స్క్వాడ్స్ అణువణువూ తనిఖీలు చేపట్టింది. కొద్ది రోజుల క్రితమే స్కూల్స్‌కు బెదిరింపులు వచ్చాయి. తాజాగా ఆస్పత్రులకు బెదిరింపు కాల్స్ రావడంతో తనిఖీలు చేపట్టారు. రెండు ఆస్పత్రుల దగ్గర సోదాలు చేపట్టారు. ఇదిలా ఉంటే ఇప్పటివరకు ఎలాంటి అనుమానాస్పద వస్తువులు గానీ.. డివైజ్‌లు గానీ దొరకలేదని పోలీసులు తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం 3:15 గంటలకు ఢిల్లీలోని బురారి ఆస్పత్రికి తొలుత బెదిరింపు ఈ మెయిల్ వచ్చింది. అనంతరం సాయంత్రం 4:26 గంటలకు సంజయ్ గాంధీ ఆస్పత్రికి రెండో బెదిరింపు వచ్చింది. అప్రమత్తమైన పోలీసులు సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. మూడో బెదిరింపు.. సాయంత్రం 6:15 గంటలకు ఢిల్లీ ఎయిర్‌పోర్టుకు బెదిరింపు కాల్ వచ్చింది. వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఎలాంటి అనుమానాస్పద వస్తువులు దొరకలేదు.

## ఆర్టీసీ సంక్రాంతి రికార్డు బ్రేక్

మొదటి పేజీ తరువాయి...

ఓటు వేసేందుకు సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికుల సౌకర్యార్థం టీఎస్‌ఆర్టీసీ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది. ఏపీ వైపునకు ఇప్పటివరకు 590 స్పెషల్ బస్సులను ఏర్పాటు చేయగా.. తాజాగా హైదరాబాద్-విజయవాడ రూట్‌లో 140 సర్వీసులను ఆన్‌లైన్‌లో ముందస్తు రిజర్వేషన్ కోసం పెట్టింది. ఆయా బస్సుల్లో దాదాపు 3 వేలకుపైగా సీట్లు అందుబాటులో ఉన్నాయి. టికెట్ల ముందస్తు రిజర్వేషన్ కోసం వెబ్‌సైట్‌ను సంప్రదించాలని టీఎస్‌ఆర్టీసీ కోరింది. అలాగే, హైదరాబాద్ నుంచి జిల్లాలకు 1500 ప్రత్యేక బస్సులను టీఎస్‌ఆర్టీసీ నడుపుతోంది. జేబీఎస్, ఎంజీబీఎస్, ఉప్పల్, ఎల్బీనగర్, ఆరాంఘర్, తదితర ప్రాంతాల నుంచి ఈ బస్సులను తిప్పుతోంది. ప్రయాణికుల రద్దీని బట్టి ఎప్పటికప్పుడు బస్సులను అందుబాటులో ఉంచాలని క్షేత్రస్థాయి అధికారులను యాజమాన్యం ఆదేశించింది. ఆర్టీసీ బస్సుల్లో సురక్షితంగా సొంతూళ్లకు వెళ్లి తమ అమూల్యమైన ఓటు హక్కును వినియోగించుకోవాలని ప్రయాణికులను ఈ సందర్భంగా టీఎస్‌ఆర్టీసీ యాజమాన్యం కోరింది.







రాజేంద్రనగర్‌లోని వెటర్నరీ కళాశాల ఎన్ సీ సీ మైదానంలో ఏర్పాటు చేసిన రాజేంద్రనగర్ అసెంబ్లీ నియోజకవర్గం ఈవీఎం డిస్ట్రిబ్యూషన్ సెంటర్ వద్ద ఎన్నికల సిబ్బంది



## 543 పోలింగ్ స్టేషన్‌లకు

# ఎన్నికల సామాగ్రి తరలింపు

**రాజేంద్రనగర్ ఈవీఎం డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుంచి ఈవీఎం మిషన్‌ల తరలింపు**

**పోలింగ్ కేంద్రాల వద్ద అన్ని ఏర్పాట్లు పూర్తి**

బుద్వేల్, మే12(ప్రభాత ఉదయం) : రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని వెటర్నరీ కళాశాల ఎన్ సీసీ మైదానంలో ఏర్పాటు చేసిన రాజేంద్రనగర్ నియోజకవర్గం ఈవీఎం యంత్రాల డిస్ట్రిబ్యూషన్ కేంద్రం వద్ద ఎన్నికల విధులలో పాల్గొంటున్న సిబ్బందికి చేవెళ్ల పార్లమెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక ఆధ్వర్యంలో ఈవీఎం యంత్రాలను, ఎన్నికల సామాగ్రిని ఆదివారం పంపిణీ చేశారు. రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలో 543 పోలింగ్ స్టేషన్ లు ఉండగా ఈవీఎం యంత్రాల పంపిణీ కార్యక్రమం లో 10 వేల మంది ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు. 49 రూట్లలో ఏర్పాటు చేసిన బస్సులలో పోలీస్ సిబ్బంది ఎస్కార్ట్ గా సిబ్బంది తమకు కేటాయించిన పోలింగ్ స్టేషన్ లకు కు తరలి వెళ్లారు. ఈ ఏర్పాట్లను చేవెళ్ల పార్లమెంటు నియోజక వర్గం అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, రాజేంద్రనగర్ ఆర్డీఓ వెంకట్ రెడ్డి దగ్గరుండి చూశారు . ఆయనకు రాజేంద్రనగర్, గండిపేట్, శంషాబాద్ మండలాల తహశీల్దార్ లు బి. రాములు, శ్రీనివాస్ రెడ్డి, నాగమణి లు సహకారం అందజేశారు. రాజేంద్రనగర్ సర్కిల్ లో ఉన్న 288 పోలింగ్ స్టేషన్ ల వద్ద సిబ్బందికి కావలసిన ఏర్పాట్లను, సోమవారం జరిగే ఎన్నికల సందర్భంగా ఓటర్లకు ఎలాంటి అసౌకర్యాలు జరగకుండా రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ కే రవికుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు.

**ఓటర్లు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలి : రాజేంద్రనగర్ డీసీపీ చింతమనేని శ్రీనివాస్**

రాజేంద్రనగర్ డీసీపీ పరిధిలోకి వచ్చే చేవెళ్ల, రాజేంద్రనగర్ అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో నివసించే ఓటర్లు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని డీసీపీ చింతమనేని శ్రీనివాస్ తెలిపారు. తన పరిధిలోకి వచ్చే ఈ రెండు నియోజకవర్గాలలో 1200 మందితో గట్టి పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రజలు ఎలాంటి భయం లేకుండా పోలింగ్ స్టేషన్ కు వచ్చి తమ ఓటును వేయాలన్నా రు. ఎన్నికల విధులకు ఆటంకం కలిగించే వారి పట్ల కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

**ఓటర్లను ఆకట్టుకునేందుకు స్వాగత ద్వారాలు :**

ఓటు వేయడానికి వచ్చే ఓటర్లను ఆకట్టుకునేందుకు పోలింగ్ స్టేషన్ల వద్ద మోడల్ పోలింగ్ స్టేషన్ అంటూ స్వాగత ద్వారాలను ఏర్పాటు చేశారు. యువత , వికలాంగులు , మహిళల పేరుతో మోడల్ పోలింగ్ స్టేషన్ లను తీర్చిదిద్దారు.





ఈవీఎంలు ఎన్నికల సామాగ్రితో పోలింగ్ స్టేషన్లకు బయలుదేరిన సిబ్బంది






రాజేంద్రనగర్ సర్కిల్ లోని వివిధ పోలింగ్ స్టేషన్‌లకు చేరుకుని తమ విధులలో నిమగ్నమైన సిబ్బంది




ఓటర్లకు స్వాగతం పలుకుతూ స్వాగత ద్వారాలు




రాజేంద్రనగర్ డీసీపీ చింతమనేని శ్రీనివాస్



ఆదివారం సాయంత్రం శాస్త్రిపురం కాలనీ లో తాను ఉంటున్న ప్రాంతంలో చిన్నారులతో కలసి క్రికెట్ ఆడుతున్న హైదరాబాద్ మజ్లీస్ అభ్యర్థి అసదుద్దీన్ ఒవైసీ

## చిన్నారులతో కలసి క్రికెట్ ఆడుతున్న అసదుద్దీన్ ఒవైసీ

రాజేంద్రనగర్, మే12(ప్రభాత ఉదయం) : పార్లమెంటు ఎన్నికల సందర్భంగా శనివారం సాయంత్రానికి ప్రచారం ముగియడంతో ఆదివారం ఉదయం అంతా హైదరాబాద్ పార్లమెంట్ మజ్లిస్ అభ్యర్థి శాస్త్రిపురం లోని తన నివాసంలోనే గడిపారు. సాయంత్రం నమాజు అనంతరం తాను నివాసం ఉండే ప్రాంతంలో క్రికెట్ ఆడుతున్న చినారులతో కలిసి ఆయన కాసేపు క్రికెట్ ఆడారు. చిన్నారులు వేసిన బంతులకు ఆయన షాట్లు కొడుతూ ఆనందంగా గడిపారు.



మదర్స్ డే వేడుకలలో పాల్గొన్న మాతృమూర్తులు

## రాజేంద్రనగర్ మన్నా చర్చిలో మదర్స్ డే వేడుకలు

బుద్వేల్, మే12(ప్రభాత ఉదయం) : రాజేంద్రనగర్ మన్నా చర్చిలో ఆదివారం మదర్స్ డే వేడుకలను నిర్వహించారు. ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు ఆదివారం ఆరాధన లు జరుపుకున్న క్రైస్తవ సోదరులు అనంతరం మాతృమూర్తులు అందరిని వేదికపైకి పిలిచి మదర్స్ డే వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లులందరి గురించి బ్రదర్ జోబ్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. బైబిల్ లో ఉన్న తల్లుల గురించి వివరించారు. పిల్లలను పెంచడంలో, కుటుంబ బాధ్యతలలో తల్లుల పాత్ర ఎంతో ఉంటుందని గుర్తు చేశారు.



సంఘటన స్థలాన్ని సందర్శించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

## ఈత కోసం వెళ్లి క్వారీ గుంతలో మునిగి బాలుడు మృతి

షాద్ నగర్,మే12(ప్రభాత ఉదయం):ఈత కోసం వెళ్లి క్వారీ గుంతలో మునిగి బాలుడు మృతి చెందిన సంఘటన కేశంపేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది.ఆదివారం కేశంపేట పోలీసులు తెలిపి వివరాల ప్రకారం...కేశంపేట మండలం పుట్టోనిగూడ గ్రామపంచాయతీ కక్కరాల తాండకు చెందిన మూడవత్ నితిన్ (18) గ్రామ సమీపంలోని క్వారీ గుంతలో ఈతకని వెళ్లి మునిగి మరణించడం జరిగిందన్నారు.అనంతరం మృతదేహాన్ని వెలికి తీయడం కోసం ఎన్డీఆర్ఎఫ్ బృందాలు రంగంలోకి దిగి బాలుడి శవాన్ని వెలికి తీయడం జరిగిందన్నారు.ఈ సమాచారాన్ని తెలుసుకున్న షాద్నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఘటన స్థలాన్ని సందర్శించి స్వయంగా పర్యవేక్షించడం జరిగిందన్నారు.మృతదేహాన్ని వెలికితేత తరువాత బాలుడి కుటుంబ సభ్యులను పరామర్శించడం జరిగిందని సూచించారు.మృతుడు కుటుంబానికి అన్ని విధాలుగా ఆదుకుంటామని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హామీ ఇచ్చారు.



మార్నింగ్ వాకర్స్ చేత ప్రతిజ్ఞ చేయిస్తున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎం లక్ష్మణ్

## ఓటు మన బాధ్యత

### హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ లక్ష్మణ్

బుద్వేల్, మే12(ప్రభాత ఉదయం): ప్రజాస్వామ్యంలో ఓటు హక్కును వినియోగించుకోవడం పౌరుల బాధ్యత అని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎం.లక్ష్మణ్ అన్నారు. పౌరుల తలరాతలను మార్చే ఓటు హక్కు విషయంలో నిర్లక్ష్యం ఎంత మాత్రం తగదని ఆయన స్పష్టం చేశారు. గుడ్ ఫ్రెండ్స్, చింతకుంట వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అత్తాపూర్ డివిజన్ పరిధిలోని చింతకుంట పార్కులో ఆదివారం ఓటర్ అవగాహన కార్యక్రమం జరిగింది.ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న జస్టిస్ లక్ష్మణ్ మాట్లాడుతూ, విద్యావంతులు, వివేకుల కంటే పెద్దగా చదువుకోని వారు చక్కగా తమ ఓటు హక్కును వినియోగించుకుంటున్నారని అన్నారు. దేశ భవిష్యత్తును మార్చే ఈ లోక్సభ ఎన్నికలలో కూడా మొదటి మూడు దశల్లో పోలింగ్ శాతం పరిపోవడం ఆందోళనకర పరిణామం అని అన్నారు. ఈ పరిస్థితి నివారించడానికి సోమవారం జరిగే ఎన్నికలలో తెలంగాణ ప్రజలు పెద్ద సంఖ్యలో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ప్రముఖ బిల్డర్ రామిరెడ్డి మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల కంటే పట్టణ నగర ప్రాంతాలలో పోలింగ్ శాతం దారుణంగా పడిపోవడం ఆందోళనకరమైన విషయమని అన్నారు. ఈ పరిస్థితి పునరావృతం కాకుండా ఓటర్లు బాధ్యతతో వ్యవహరించాలని కోరారు. సామాజిక కార్యకర్త, సీనియర్ జర్నలిస్ట్ మ్యాడం మధు సూదన్ కార్యక్రమానికి వందన సమర్పణ చేశారు. ఈ కార్యక్రమంలో వివిధస్వచ్ఛంద సంఘాల ప్రతినిధులు వినోద్ కుమార్ ,సుబ్బరాజు, సుధాకర్ ప్రభాకర్, ప్రవీణ్, నరసింహ, కొంగల శీను,శెట్టి గారి శేఖర్, శ్రీధర్ రెడ్డి, సిరి పాల్ రెడ్డి శతదితరులు పాల్గొన్నారు



డీసీపీ శ్రీనివాస్ తో ఎన్ సి సి కెడిట్లు

## ఎన్నికల విధుల్లో ఎన్‌సిసి కేడిట్లు

రాజేంద్రనగర్, మే12(ప్రభాత ఉదయం) పార్లమెంట్ సాధారణ ఎన్నికల్లో వ్యవసాయ, పశు వైద్య విశ్వవిద్యాలయంలో చదివే ఎన్ సి సి విద్యార్థులు విధులు నిర్వహించారు. ఆదివారం రాజేంద్రనగర్ డిసిపి చింతమనేని శ్రీనివాసన్ 21 మంది ఎన్ సి సి విద్యార్థులు కలిశారు. ఈ సందర్భంగా డిసిపి సిహెచ్ శ్రీనివాస్ విద్యార్థులకు ఎన్నికల విధుల్లో నిబంధనలను వివరించారు. ఎన్నికల విధుల్లో ఎన్ సి సి విద్యార్థులు ప్రజలకు సహకారాలు అందించాలని కోరారు.





బుద్వేల్ చర్చ్ లో జరిగిన మదర్స్ డే వేడుకలలో తల్లులు



బుద్వేల్‌లోని గుడ్ షెపర్డ్ ప్రేయర్ హౌస్‌లో మదర్స్ డే వేడుకలలో పాల్గొన్న మాతృ మూర్తులు

## గుడ్ న్యూస్ రైతుల అకౌంట్లోకి 9500 జమ



హైదారాబాద్,మే12 (ప్రభాత ఉదయం): ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి యోజనను పీఎం కిసాన్ యోజన అని కూడా అంటారు.2019లో భారత ప్రభుత్వం ప్రారంభించిన విప్లవాత్మక కార్యక్రమాల్లో ఇది కూడా ఒకటి.సన్న,చిన్నకారు రైతులకు ఆర్థిక సహాయం అందజేసేందుకు దీన్ని తీసుకువచ్చారు.వీరికి ఆర్థిక సహాయం అందించడం,వ్యవసాయ కార్యకలాపాలను కొనసాగించడం,జీవనోపాధిని మెరుగుపరచడం దీని ప్రధాన లక్ష్యం.మే చివరకు..లేదంటే జూన్ లో దేశవ్యాప్తంగా ఉన్న అన్నదాతలతోపాటు ఏపీ తెలంగాణ రైతులు కూడా 17వ విడత పీఎం కిసాన్ సమ్మాన్ నిధి యోజన కోసం ఎదురుచూస్తున్నారు.వారికి 16వ విడత డబ్బులు ఈ ఏడాది ఫిబ్రవరిలో విడుదలయ్యాయి.ప్రతి నాలుగు నెలలకు ఒకసారి ఈ పథకం కింద డబ్బులు నేరుగా రైతుల ఖాతాల్లోనే పడతాయి.ప్రతి వాయిదాకు రూ.2వేల చొప్పుడు మూడు విడతల్లో మొత్తం రూ.6వేలు రైతుల ఖాతాల్లో జమయ్యాయి.17వ విడత డబ్బు మే చివరికి లేదంటే జూన్ మొదటివారంలో విడుదలయ్యే అవకాశం ఉంది.ప్రతి ఏడాది రూ.21వేలు దీనిపై ఇంకా అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.17వ విడత కోసం రైతులు ఈకేవైసీ చేయించుకోవాలి.కిసాన్ సమ్మాన్ నిధి యోజన కింద కేంద్రం రైతులకు ఏటా రూ.6వేలు అందిస్తోంది.తెలంగాణ ప్రభుత్వం రైతు బంధు ద్వారా రూ.10వేలు అందిస్తోంది.వచ్చే వర్షాకాలం నుంచి కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణలోని రైతులందరికీ రైతు భరోసా పేరుతో రూ.15వేలు అందించబోతోంది. మొత్తంగా అన్నదాతలకు ప్రతి సంవత్సరం రూ.21వేల చొప్పున వారి ఖాతాల్లో జమవుతున్నాయి.ఈకేవైసీ తప్పనిసరి జూన్ మొదటివారంలో రూ.2వేలు జమైన తర్వాత వర్షాకాలంలో తెలంగాణ రైతుల ఖాతాలో ఎకరాకు రూ.7500 వేయనున్నారు.ఒకేసారి రైతులకు రూ.9500 పెట్టుబడి సాయం కింద అందనున్నాయి.pmkisan.gov.in అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించి పూర్తి వివరాలు తెలుసుకోవచ్చు.వ్యవసాయ మంత్రిత్వ శాఖ వెబ్‌సైట్, PM కిసాన్ సమ్మాన్ నిధి హెల్ప్‌లైన్ నంబర్ 1800-945-8955లో పూర్తి సమాచారం తెలుసుకోవచ్చు.అయితే రైతులు తప్పనిసరిగా 17వ విడత డబ్బుల కోసం ఈకేవైసీ చేయించుకోవాలి.

## ఓటర్లు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలి

రాజేంద్ర దగ్గర సర్కిల్ లోని సమస్యాత్మక పోలింగ్ స్టేషన్‌లను పరిశీలిస్తున్న సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాష్ మహంతి






చిత్రంలో రాజేంద్రనగర్ డీసీపీ చింతమనేని శ్రీనివాస్ తదితరులు.

### సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి

బుద్వేల్, మే12(ప్రభాత ఉదయం) : సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ఓటర్లు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాష్ మహంతి కోరారు. సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పార్లమెంట్ ఎన్నికల బందోబస్తు నిమిత్తం ఎనిమిది వేల మంది పోలీసు సిబ్బందితో పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఆదివారం రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని సమత్యాత్మక పోలింగ్ స్టేషన్ లను ఆయన పరిశీలించారు. ముందుగా అత్తాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లోని పోలింగ్ స్టేషన్ ను సందర్శించిన ఆయన ఆ తర్వాత సిక్ చావునీ, నౌ నెంబర్ , సులేమాన్ నగర్ , శాస్త్రి పురం పోలింగ్ స్టేషన్ లను పరిశీలించి అక్కడ జరుగుతున్న ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు . పోలింగ్ స్టేషన్ లలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, సోమవారం జరుగుతున్న పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ సందర్భంగా ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. ఓటర్లు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. కమిషనర్ వెంట రాజేంద్రనగర్ డీసీపీ చింతమనేని శ్రీనివాస్ తో పాటు పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# ప్రజలందరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలి

### జిల్లా కలెక్టర్ బిఎస్ సంతోష్



ఈవీఎంల డిస్ట్రిబ్యూషన్ కేంద్రం వద్ద ఈవీఎంలను తనిఖీ చేస్తున్న కలెక్టర్ బి ఎస్ సంతోష్

గద్వాల జిల్లా ప్రతినిధి, మే 12(ప్రభాత ఉదయం)పోలింగ్ కు అన్ని ఏర్పాట్లు చేశామని, 13వ తేదీన ప్రజలందరూ తప్పనిసరిగా పోలింగ్ కేంద్రాలకు వెళ్లి తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ బి.యం సంతోష్ విజ్ఞప్తి చేశారు. నాగర్ కర్నూల్ పార్లమెంట్ ఎన్నికలను పురస్కరించుకొని ఈ నెల 13వ తేదీన నిర్వహించిన పోలింగ్ కోసం పగడ్బందీగా అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందని, కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పోలింగ్ సమయం సాయంత్రం 6 గంటల వరకు పొడిగించినట్లు జిల్లా ఎన్నికల అధికారి తెలిపారు. ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరు పోలింగ్ కేంద్రానికి వెళ్లి తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని , ఓటింగ్ శాత%శీ% పెరగడానికి సహకరించాలని కోరారు. జిల్లా ఎన్నికల అధికారి ఈరోజు గద్వాల అలంపూర్ అసెంబ్లీ సెగ్మెంట్లలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్లను పరిశీలించారు. 79-గద్వాల్ అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో 303 పోలింగ్ కేంద్రాలకు గాను పి.ఓ లు 303 , ఎ.పి .ఓ లు 303, ఓ.పి.ఓ లు 606 మొత్తం 1212 మంది ఎన్నికల సిబ్బందితో పాటు అదనంగా 244 మందిని కేటాయించడం జరిగిందన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలలో 44 మంది మైక్రో అబ్జేర్వేర్లను నియమించడం జరిగిందని, గద్వాల్ లో 34 రూట్లను ఏర్పాటు చేసి ఒక్కో రూట్ కు ఒక్కో సెక్టార్ అధికారిని నియమించడం జరిగిందని అన్నారు. వారికి ప్రత్యేక వాహనాలను , పోలింగ్ సిబ్బందిని తరలించుటకు 34 బస్సులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 80- అలంపూర్ అసెంబ్లీ సెగ్మెంట్ లో 291 పోలింగ్ కేంద్రాలకు గాను పి.ఓ లు 291 , ఎ.పి .ఓ ల 291, ఓ.పి.ఓ లు 582 , రిజర్వు 236 మందిని కేటాయించడం జరిగిందని, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలలో 54 మంది మైక్రో అబ్జేర్వేర్లను నియమించడం జరిగిందని అన్నారు. గద్వాల్ లో 31 రూట్లను ఏర్పాటు చేసి ఒక్కో రూట్ కు ఒక్కో సెక్టార్ అధికారిని నియమించడం జరిగిందని అన్నారు. వారికి ప్రత్యేక వాహనాలను , పోలింగ్ సిబ్బందిని తరలించుటకు 31 బస్సులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాలకు పోలింగ్ సిబ్బంది ఈరోజు సాయంత్రం ఆరు గంటల వరకు వారి పోలింగ్ కేంద్రాలకు చేరుకోవడం జరుగుతుందని తెలిపారు. కూలింగ్ సిబ్బందికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా డిస్ట్రిబ్యూషన్ సెంటర్ల వద్ద భోజన సదుపాయాలతో పాటు, త్రాగునీరు, మరుగుదొడ్లు ఇతర సదుపాయాలు కల్పించడం జరిగిందని అన్నారు. తీవ్రమైన ఎండల దృష్ట్యా పోలింగ్ సిబ్బందికి అవసరమైన టెంట్లు, కూలర్లతో పాటు మెడికల్ కిట్లు ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు తదితర వసతులు కల్పించడం జరిగిందన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడానికి అన్ని శాఖల సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి చేసామని తెలిపారు. ఓటు వేయడం అందరి బాధ్యత అని, జిల్లాలోని ప్రతి ఓటరు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినుయోగించుకోవాలని కలెక్టర్ ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.

# చేవెళ్ల పార్లమెంట్ ఎన్నికల కేంద్రం బిఎస్ఐటి వద్ద ప్రత్యేక విద్యుత్ ఏర్పాట్లు



చేవెళ్ల పార్లమెంట్ ఎన్నికల కౌంటింగ్ కేంద్రం వద్ద విద్యుత్ ఏర్పాటు చేస్తున్న ఏడిఈ స్వామి, ఏఈలు జానీ మోహినుద్దీన్, నరేందర్ లు

### విద్యుత్ సరఫరా లో అంతరాయం లేకుండా ప్రత్యేక చర్యలు: ఏ డి ఈ స్వామి

చేవెళ్ల, మే12(ప్రభాత ఉదయం) చేవెళ్ల పార్లమెంట్ ఎన్నికల కౌంటింగ్ కేంద్రం చేవెళ్లలోని బండారు శ్రీనివాస్ రెడ్డి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (బి ఎస్ ఐ టి) లో ఏర్పాటు చేశారు. పార్లమెంట్ నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ కేంద్రాల నుండి ఈవీఎంలను పోలింగ్ అనంతరం బిఎస్ఐటి ఇంజనీరింగ్ కళాశాలలో భద్రపరచనున్నారు. చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గం లోని మహేశ్వరం, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి, చేవెళ్ల, పరిగి, వికారాబాద్, తాండూర్ అసెంబ్లీ నియోజకవర్గం లోని పోలింగ్ కేంద్రాలలో పోలింగ్ అనంతరం కౌంటింగ్ కేంద్రానికి ఈవీఎంలను తరలిస్తున్నట్లు చేవెళ్ల పార్లమెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక్ తెలిపారు, రెవెన్యూ యంత్రాంగం ఎన్నికలలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాటు చేశారు.

#### ఎన్నికల కౌంటింగ్ కేంద్రం వద్ద నిరంతర విద్యుత్...

చేవెళ్లలోని బి ఎస్ ఐ టి ఇంజనీరింగ్ కళాశాలలో కౌంటింగ్ కేంద్రం ఏర్పాటు చేసిన దృష్ట్యా సైబర్ సిటీ విద్యుత్ అధికారులు విద్యుత్ ఏర్పాట్లను సంపూర్ణంగా ఏర్పాటు చేశారు. విద్యుత్ సైబర్ సిటీ ఎస్ ఇ పి వెంకన్న, ఇబ్రహీం భాగ్ డి ఈ ఎం శివశంకర్, చేవెళ్ల సబ్ డివిజన్ ఏ డి ఈ స్వామి, అసిస్టెంట్ ఇంజనీర్లు జానీ మోహినిద్దీన్, నరేందర్ లు తమ సిబ్బందితో ఆదివారం విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా ఏర్పడటం చేశారు. విద్యుత్ సరఫరా లో ఏమైనా ఇబ్బంది ఉంటే ప్రత్యామ్నయం జనరేటర్ సైతం ఏర్పాటు చేశారు.

# ఢిల్లీపై ఆర్సీబీ ఘన విజయం

## ప్లే ఆఫ్ ఆశలు సజీవం.?

**ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2024 62వ మ్యాచ్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఢిల్లీ క్యాపిటల్స్ జట్లు తలపడ్డాయి. ఈ మ్యాచ్ లో బెంగళూరు 47 పరుగుల తేడాతో ఢిల్లీ క్యాపిటల్స్‌ను ఓడించింది. ఈ విజయంతో ఆర్‌సీబీ ప్లేఆఫ్ అవకాశాలు సజీవంగా ఉన్నాయి. 13 మ్యాచ్‌ల్లో 12 పాయింట్లు సాధించి పాయింట్ల పట్టికలో ఏడో స్థానం నుంచి ఐదో స్థానానికి చేరుకుంది. తర్వాత ఆడబోయే మ్యాచ్ లో ఆర్సీబీ చెన్నైపై గెలవాల్సి ఉంటుంది. ఇతర జట్ల ఫలితాలు, నెట్ రన్ రేటు ప్లేఆప్స్ రేసులో కీలకం కానున్నాయి. మరోవైపు ఢిల్లీ 13 మ్యాచ్‌ల్లో 12 పాయింట్లతో ఉంది. ప్లేఆఫ్‌కు చేరుకోవాలంటే, వారు తమ చివరి లీగ్ మ్యాచ్‌లో లక్నో సూపర్ జెయింట్‌ను ఓడించాలి. అప్పటికీ ఇతర జట్ల ఫలితాలపై ఆధారపడాల్సి ఉంటుంది. అయితే, ఆర్సీబీ, ఢిల్లీ రెండు జట్లూ ప్లేఆఫ్‌కు చేరుకోవడం అంత సులువు సాగేపనిమాత్రం కాదు.**





#### క్యాచులు వదిలి మ్యాచ్ ను చేజార్చుకున్న ఢిల్లీ..

ఈ మ్యాచ్‌లో ఢిల్లీ కెప్టెన్ అక్షర్ పటేల్ టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్నాడు. ఒక మ్యాచ్ నిషేధం కారణంగా రిషబ్ పంత్ ఈ మ్యాచ్‌లో ఆడలేదు. ఆర్సీబీ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లకు 187 పరుగులు చేసింది. అనంతరం ఢిల్లీ జట్టు 19.1 ఓవర్లలో 140 పరుగులకే కుప్పకూలింది. ఈ మ్యాచ్‌లో పేలవమైన ఫీల్డింగ్ కారణంగా ఢిల్లీ భారీ మూల్యం చెల్లించుకుంది. దీని భారాన్ని ఓటమి రూపంలో భరించాల్సి వచ్చింది. ఢిల్లీ ఫీల్డర్లు 4 క్యాచ్‌లను మిస్ చేశారు. తొమ్మిదో ఓవర్ మూడో బంతికి విల్ జాక్స్ కు లైఫ్ లభించింది. కుల్దీప్ యాదవ్ వేసిన బంతికి అక్షర్ పటేల్ క్యాచ్ వదిలాడు. అదే ఓవర్‌లో షాయ్ హెూప్ లాంగ్ ఆన్ వద్ద రజత్ పటీదార్ క్యాచ్ ను మిస్ చేశాడు. 10వ ఓవర్ నాలుగో బంతికి విల్ కు మళ్లీ లైఫ్ లభించింది. ఖలీల్ అహ్మద్ వేసిన బంతికి ట్రిస్టన్ స్టబ్స్ తన క్యాచ్‌ను వదులుకున్నాడు. 11వ ఓవర్ తొలి బంతికే పాటిదార్‌కు మళ్లీ లైఫ్ లభించింది. రసిఖ్ సలామ్ వేసిన బంతికి అక్షర్ పటేల్ తన క్యాచ్‌ను వదిలేశాడు. రజత్ పాటిదార్ 32 బంతుల్లో 52 పరుగులు, విల్ జాక్వెస్ 29 బంతుల్లో 41 పరుగులు చేశారు.

#### కోహ్లి మరోసారి..

ఆర్సీబీకి విరాట్ కోహ్లి వేగంగా శుభారంభం అందించాడు. ఫాఫ్ డుప్లెసిస్‌ను అవుట్ చేసిన తర్వాత అతను వేగంగా బ్యాటింగ్ చేశాడు. 7 బంతుల్లో ఆరు పరుగులు చేసి డుప్లెసిస్ ఔటయ్యాడు. ముఖేష్ కుమార్ వేసిన బంతికి జాక్ ఫ్రేజర్ మెక్‌గర్క్ క్యాచ్ ఇచ్చాడు. ఇషాంత్ శర్మ వేసిన తొలి ఓవర్‌లోనే కోహ్లి సిక్సర్ బాదాడు. ఆ తర్వాత రెండో ఓవర్‌లో ముఖేష్ వేసిన బంతికి సిక్సర్ బాదాడు. ఇషాంత్ వేసిన నాలుగో ఓవర్లో విరాట్ ఒక ఫోర్, సిక్సర్ బాదాడు. ఆ తర్వాత వికెట్ కీపర్ అభిషేక్ పోరెల్ చేతికి క్యాచ్ రూపంలో చిక్కాడు. విరాట్ 13 బంతుల్లో 27 పరుగుల ఇన్నింగ్స్ లో ఒక ఫోర్, 3 సిక్సర్లు బాదాడు.

#### ఢిల్లీ టాప్ ఆర్డర్ విఫలం..

ఈ మ్యాచ్‌లో ఢిల్లీ టాప్ ఆర్డర్ ఘోరంగా విఫలమైంది. 4 ఓవర్లలో 4 వికెట్లు పడిపోయాయి. డేవిడ్ వార్నర్ 2 బంతుల్లో 1 పరుగు చేశాడు. స్వప్నిల్ సింగ్ వేసిన బంతికి విల్ జాక్వెస్ క్యాచ్ పట్టాడు. అతని తర్వాత అభిషేక్ పోరెల్ 3 బంతుల్లో 2 పరుగులు చేసి ఔటయ్యాడు. యశ్ దయాళ్ వేసిన బంతికి లాకీ ఫెర్గూసన్ క్యాచ్ పట్టాడు. సూపర్ ఫామ్‌లో ఉన్న ఓపెనర్ జాక్ ఫ్రేజర్ మెక్‌గర్క్ దురదృష్టవశాత్తు రనౌట్ అయ్యాడు. 8 బంతుల్లో 21 పరుగులు చేశాడు. కుమార్ కుశాగ్రాకు మహ్మద్ సిరాజ్ ఎల్బీడబ్ల్యూ ఇచ్చాడు. అయితే, తాత్కాలిక కెప్టెన్ అక్షర్ పటేల్ అర్ధ సెంచరీతో ఇన్నింగ్స్ ఆడి ఢిల్లీ క్యాపిటల్స్ పరువు కాపాడాడు. షాయ్ హెూప్‌తో కలిసి ఐదో వికెట్‌కు 56 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పాడు. హెూప్ 23 బంతుల్లో 29 పరుగులు, అక్షర్ పటేల్ 39 బంతుల్లో 57 పరుగులు చేశారు.



## ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ బస్సుకు స్పెషల్ బస్ అనే స్టిక్కర్ పెట్టి మహిళా ప్రయాణికుల నుంచి ముక్కు పిండి చార్జీలు వసూలు

హైదరాబాద్, మే12(ప్రభాత ఉదయం): తెలంగాణ ఎక్స్ప్రెస్ బస్సు కు స్పెషల్ బస్ అనే స్టిక్కర్ పెట్టి మహిళా ప్రయాణికుల నుంచి ముక్కు పిండి పైసల్ వసూలు చేస్తున్న ఆర్టీసీ సిబ్బంది. తెలంగాణ ప్రభుత్వం ఎన్నికల ముందు మహిళల ఓట్లను రాబట్టుకునేందుకు ప్రతిష్టాత్మకంగా హామీ ఇచ్చిన మహాలక్ష్మి పథకంలో డొల్లతనం బయటపడింది వివరాల్లోకి వెళితే హైదరాబాద్ నుంచి కర్నూలు వస్తున్న ఎక్స్ప్రెస్ బస్సులో అల్లంపూర్ చౌరస్తా వరకు ఫ్రీగా మహిళలకు రవాణా సౌకర్యం కలదు.(ప్రతిరోజు స్పెషల్ బస్ పేరుతో మహిళలతో డబ్బులు వసూలు చేస్తున్న తెలంగాణ ఆర్టీసీ సిబ్బంది.) కానీ ఎక్స్ప్రెస్ బస్సు కు స్పెషల్ బస్ అని స్టిక్కర్ అతికించి నేడు మాతృ దినోత్సవం జరుపుకుంటున్న మహిళా ప్రయాణికుల నుంచి డబ్బులు తీసుకొని టికెట్ ఇవ్వడం ఎంతవరకు సబబని, ఆ బస్సులో ప్రయాణిస్తున్న ప్రయాణికులు వాపోయారు.



సంత్ సేవాలాల్ ఉత్సవాలలో పాల్గొన్న ఎంపీపీ మధుసూదన్ రెడ్డి

## సంత్ సేవాలాల్ మహారాజ్ నిజమైన సేవకుడు

### ఎంపీపీ పిన్నింటి మధుసూదన్ రెడ్డి

**మల్లాపూర్ గ్రామపంచాయతీ గుడి తండాలో సేవాలాల్ మహారాజ్ విగ్రహ ప్రతిష్ట, మరియమ్మ యాడి వార్షికోత్సవ కార్యక్రమం**

**హాజరైన మాజీ సర్పంచులు రవి నాయక్,రాందాస్ నాయక్**

కొత్తూరు,మే12 (నమస్తే ఉదయం):సంత్ సేవాలాల్ మహరాజ్ బంజారాల ఆరాధ్య దైవం అని సమాజానికి నిజమైన సేవకుడని ఎంపీపీ పిన్నింటి మధుసూదన్ రెడ్డి అన్నారు.కొత్తూరు మండలంలోని మల్లాపూర్ గ్రామ పంచాయతీ గుడి తాండలో ఆలయ చైర్మన్ నరసింహ,పూజారి పాండు నాయక్ ఆధ్వర్యంలో సంత్ సేవాలాల్ విగ్రహ ప్రతిష్ట,మరియమ్మ యాడి వార్షికోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంపీపీ పిన్నింటి మధుసూదన్ రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు.అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ఎంపీపీ పిన్నింటి మధుసూదన్ రెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...బంజారా జాతిని మంచి మార్గంలో నడిపించేందుకు సేవాలాల్ మహరాజ్ ధర్మ ప్రచారం,ఆర్థిక సంస్కరణలు,మత మార్పిడిలు అరికట్టడం,క్షేత్రధర్మాన్ని రక్షించడం లాంటి అనేక ఉద్యమాలకు నాయకత్వం వహించారన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచులు దశరత్ నాయక్,ఉప్పల దయానంద్ గుప్తా,నరసింహారెడ్డి,దయ్యాల మల్లేష్,మాజీ ఎంపిటిసి మోడీ దర్శన్,లక్ష్మణ్ నాయక్,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు సిద్దు గౌడ్,శ్రీరాములు,జయేందర్ రెడ్డి,పాపిరెడ్డి,దయానంద రెడ్డి,బోకుల రాజు,శంకర్ నాయక్,శ్రీను,నరేష్, శ్రీశైలం,తండావాసులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా లోక్ సభ ఎన్నికలకు కట్టుదిట్టమైన భద్రత

### గద్వాల జిల్లా ఎస్పీ రితిరాజ్



గద్వాల జిల్లా ప్రతినిధి, మే 12(ప్రభాత ఉదయం): అసెంబ్లీ ఎన్నికల మాదిరిగానే లోక్ సభ ఎన్నికలకు కూడ ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు పోలీస్ శాఖ పరంగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని జిల్లా ఎస్పీ రితిరాజ్ ,? పేర్కొన్నారు. సోమవారం జరిగబోయే పార్లమెంట్ ఎన్నికలకు చేపట్టిన భద్రతా చర్యలను ఒక ప్రకటన ద్వారా తెలియజేశారు. జిల్లాలో పటిష్టమైన ప్రణాళికతో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా ఇతర శాఖల సమన్వయంతో కలిసి పని చేయడం జరుగుతుందని జిల్లా ఎస్పి రితీ రాజ్ తెలిపారు. తద్వారా జిల్లాలోని ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా తమ యొక్క ఓటు హక్కును వినియోగించుకునే వాతావరణం కల్పిస్తున్నాం.శాంతి యుత వాతవారణంలో ఎన్నికలు నిర్వహించడానికి జిల్లాలో 1200 మంది జిల్లా, రాష్ట్ర ( టి ఎస్ ఎస్ పి , శిక్షణ కానిస్టేబుళ్లు), కేంద్ర (3 కంపినీల ఐటి బిపి బలగాల) పోలీస్ బలగాలతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగింది ,ప్రతి మండలానికి ఇన్స్పెక్టర్ స్థాయి అధికరితో ప్రత్యేక పెట్రోలింగ్ పార్టీలు, 65 రూట్ మొబైల్స్, 25 క్విక్ రియాక్షన్ టీమ్స్ (%ు=%)/ స్ట్రయికింగ్ ఫోర్స్/ స్పెషల్ స్ట్రయికింగ్ టీమ్స్/ అబ్జర్వేషన్ టీమ్స్ లతో పకడ్బందీ గ భద్రతా చర్యలు చేపట్టడం జరిగిందని అన్నారు.

#### జిల్లా లోని పోలింగ్ కేంద్రాల వివరాలు:

జిల్లాలో మొత్తం పోలింగ్ స్టేషన్ లు 594, సాధారణ పోలింగ్ స్టేషన్లు 435 , క్రిటికల్ పోలింగ్ కేంద్రాలు 159.

#### స్వాధీన పరుచుకున్న వివరాలు :

ఇప్పటివరకు స్వాధీనపరచుకున్న నగదు 1,56,76,860 /- రూపాయలు.

లిక్కర్ 5344.095 లీటర్లు, సుమారుగా అంచనా విలువ 37,08,066/- /-రూపాయలు

ఇతర సామాగ్రి: సుమారుగా అంచన విలువ 7500 /- రూపాయలు.

సీజ్ చేసినా నగదు, లిక్కర్, ఇతర వస్తువుల విలువ మొత్తం విలువ 1,93,92,426/- రూపాయలు

జిల్లాలో ఇప్పటివరకు బైండోవర్ చేయబడిన వ్యక్తులు 390

గతంలో ఎలక్ట్రోరల్ నేరాలకు పాల్పడ్డ వ్యక్తులను మరియు అందులో సహకరించిన వ్యక్తులను బైండోవర్ చేయడమైనదని, రౌడీ షీట్ కలిగిన వారిని కూడా ముందస్తుగా బైండోవర్ చేయడం జరిగింది.32 ఎన్ బి డబ్ల్యు ఎగ్జిక్యూట్ చేయడం జరిగింది అన్నారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘనాలపై కఠినంగా ఉన్నామన్నారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన రోజు నుండి ఇప్పటివరకు జిలాల్లో ఎన్నికల నియామావళి ఉల్లంఘన కేసులు 04 నమోదు కావడం జరిగిందని అన్నారు.

లైసెన్సుడు ఆయుధముల డిపాజిట్: ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా నియామవళి అనుసారంగా లైసెన్సు కలిగిన ఆయుధములు అన్నియు డిపాజిట్ కొరకు అండర్ సెక్షన్ 144 %జతీ.జూ౩% అనుసరించి నిషేధాజ్ఞలు జారీ చేయడం జరిగింది , ఇప్పటికే జిల్లా లో ఉన్న మొత్తం 53 ఆయుధములు డిపాజిట్ కాబడినవి.

జిల్లా ప్రజలు పోలీసులకు సహకరిస్తూ ఎన్నికల కమిషన్ ఆదేశించిన ఎన్నికలు నియమావళి పాటిస్తూ స్వేచ్ఛాయుత వాతావరణం లోఎలాంటి భయం, వత్తిడి లేకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలని, అందుకు సంబందించి ప్రజలకు సురక్షితమైన భద్రత ఏర్పాట్లు చేయడం జరిగినదని ఓటు ఉన్న అందరు ఓటు వేయాలని ఎస్పీ రీతి రాజ్ కోరారు.ఓటర్లను ప్రలోభ పెట్టడానికి డబ్బులు, మద్యం, ఇతర విలువైన వస్తువులు తీసుకొని వెళ్తున్నట్లు సమాచారం ఉంటే డయల్ 100 కి లేదా సంబంధిత పోలీస్ స్టేషన్ వారికి సమాచారం అందించాలని సూచించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు ఎవరైనా పాల్పడిన, ఎన్నికల నియమావళి ప్రకారం చట్ట రీత్యా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఎలాంటి భయం లేకుండా ఓటు ఉన్న ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎస్పీ రీతి రాజ్ కోరారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: KOTLA CHANDRA KANTH. "RNI. Title- Code: TELTEL12231**. Cell: 9705231654.